సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 3 । మార్చి । 2023



ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌కు కాన్పు

కావలి ఏరియా ఆస్పత్రి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ హిమబిందు అదే ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్నారు. సౌకర్యాలు బాగుండటమే దీనికి కారణమని తెలిపారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రాము)	రూ.5,164
3 శాతం జీఎస్టీతో	రూ.5,319
సవర (8 గ్రా)	రూ.42,552

గరిష్టం/కనిష్టం
33.5 /22.8

వాతావరణం

గురువారం గాలిలో 50 శాతం తేమ ఉంది. జిల్లాలో పగలు వేడి వాతావరణం ఉంది. శుక్రవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

వేగంగా చెరువుల అభివృద్ధి



మాట్లాడుతున్న పీడీ వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన చెరువుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి గురువారం ఆయన ఏపీఓ, ఈసీలు, పీఏలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆదివారాలు సైతం కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు.

సోమశిలలో 60.877 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 60.877 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 116 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,000 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 703, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 98.143 మీటర్ల మట్టం నమోదైంది.

కొనసాగుతున్న పెన్షన్ల పంపిణీ



నెల్లూరుకు చెందిన కోమలమ్మకు ఆస్పత్రిలో నగదు అందజేస్తున్న వలంటీర్ కీర్తినాథ్


నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 3,08,953 మందికి నగదు ఇవ్వాల్సి ఉంది. గురువారం నాటికి లబ్ధిదారులకు 2,89,667 మందికి పెన్షన్ అందించారు. దీంతో 93.76 శాతం నమోదైంది. ఈనెల 5వ తేదీ వరకు నగదు పంపిణీ చేయనున్నారు.

నిమ్మ ధర పెరిగింది

- బస్తా కాయలు రూ.6,500



పొదలకూరు: నిమ్మ ధరలు వారంరోజులుగా ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం లూజు (బస్తా) ఒక్కంటికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. చలితీవ్రత తగ్గుముఖం పట్టడం, ఇతర ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. కిలోల వంతున పరిశీలిస్తే రూ.70 నుంచి రూ.82 వరకు అమ్ముడుపోతున్నాయి. ఢిల్లీ మార్కెట్‌లో కాయల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. రానున్న రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది.



దాహం తీరేలా.. వేసవి ప్రణాళిక

ఎండాకాలం మొదలైంది. ప్రజల తాగునీటి అవసరాలు పెరిగాయి. పల్లెల్లో చేతిపంపులపై ఆధారపడిన వారు ఎందరో ఉన్నారు. వారు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ (రూరల్ వాటర్ సప్లై) చర్యలు తీసుకుంది. మూడు సంవత్సరాల క్రితం దాహం కేకలు వినిపించినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. నేడు ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం ముందస్తుగానే పక్కా ప్రణాళిక రూపొందించి అవసరమైన పనులకు శ్రీకారం చుట్టింది.

గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి

- 45 రోజులపాటు స్పెషల్ డ్రైవ్
- పరిశీలన.. వేగంగా రిపేర్లకు శ్రీకారం
- నాడు అనేక మండలాల్లో తాగునీటి సమస్య
- నేడు పుష్కలంగా భూగర్భ జలాలు

నెల్లూరు(పొగతోట): వేసవి కాలంలో పల్లె జనానికి రక్షిత జలాల సరఫరాకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 45 రోజుల ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో భాగంగా చేతిపంపులు, రక్షిత తాగునీటి పథకాలను పరిశీలించి ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చేయాలి. గత నెల ఒకటో తేదీనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 15వ తేదీ వరకు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది.

ప్రస్తుత పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. ఎక్కడా బోర్లు ఎండిపోలేదు. బోగోలు మండలంలో ఒక గ్రామంలో మాత్రమే తాగునీటిని ట్యాంకర్ ద్వారా రవాణా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎండాకాలం నేపథ్యంలో రక్షిత జలాల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా మండలాల్లో ఉన్న బోర్ మెకానిక్‌లు చేతి పంపులు పరిశీలిస్తూ మరమ్మతులుంటే వెంటనే చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మేజర్ సమస్య ఉంటే స్థానిక సర్పంచ్, ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనికోసం 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్‌ను వినియోగిస్తున్నారు.



వ్యాటర్ టాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఒకప్పుడు

గతంలో సీతారామపురం, ఉదయగిరి, మర్రిపాడు, బోగోలు, రాపూరు, వింజమూరు తదితర మండలాల్లో వేసవికాలంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. బోర్లు ఎండిపోయి ప్రజలు నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం కంటితుడుపు చర్యలు తీసుకుంది. ట్యాంకర్ల ద్వారా రోజూ అంతంత మాత్రంగా నీటి సరఫరా జరిగేది. అవి ఎప్పుడొస్తాయో తెలియక ప్రజలు ఎదురుచూసేవారు. 2019 సంవత్సరం నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. చేతిపంపుల ద్వారా నీరు పుష్కలంగా వస్తోంది. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసే పరిస్థితులు ఎక్కడా తలెత్తలేదు.

జిల్లాలో..

మండలాలు :	37
ఆవాస గ్రామాలు :	1,919
చేతిపంపులు :	13,500
సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు):	18
పీడబ్ల్యూఎస్ (రక్షిత తాగునీటి పథకాలు)	1,034
ఎంపీడబ్ల్యూఎస్ (మినీ రక్షిత తాగునీటి పథకాలు)	580

కరువు మండలాలు లేవు

సాధారణంగా ప్రతి సంవత్సరం వర్షపాతం ఆధారంగా రాష్ట్ర ఉన్నతాధికారులు కరువు మండలాలను ప్రకటిస్తారు. ఆయా మండలాల్లో రక్షిత మంచినీటి సరఫరా తదితర వాటికి నిధులు కేటాయింపులు ఉంటాయి. వర్షాలు బాగా కురవడం, భూగర్భజలాలు అధికంగా ఉండటంతో ప్రస్తుతం జిల్లాలో కరువు మండలాలు లేవు. గతంలో ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు, బోగోలు తదితర మండలాల్లో వర్షాలు తక్కువగా కురిసేవి. ప్రస్తుతం అక్కడ కూడా అధిక వర్షపాతం నమోదవుతోంది. దీంతో నీటికి ఢోకా లేకుండాపోయింది.

దీనిపై ఇప్పటికే ఆయా పంచాయతీల సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చారు.



నెల్లూరు రూరల్ మండలంలో చేతిపంపును పరిశీలిస్తున్న సిబ్బంది

వేగంగా మరమ్మతులు



వేసవిని దృష్టిలో పెట్టుకుని చేతిపంపులు, తాగునీటి పథకాల మరమ్మతులు చేపడుతున్నాం. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఈనెల 15వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రస్తుతం బోగోలు మండలంలో ఒక గ్రామంలో మాత్రమే ట్యాంకర్ ద్వారా ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నాం. ఎండాకాలంలో గ్రామీణ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

– ఎ.రంగప్రసాద్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

175 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పగలరా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి

- టీడీపీని ప్రశ్నించిన సిటీ ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): '2024 ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పే ధైర్యం టీడీపీకి ఉందా?, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కనీసం మ్యాజిక్ ఫిగర్ స్థానాల్లో పోటీ చేస్తారా?' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని విజయమహల్‌గేట్ సమీపంలో ఉన్న ఎంసీఎస్ కల్యాణ మండపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డితో కలిసి అనిల్ గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లో సింగిల్‌గా వచ్చారని, 2024లో కూడా అలాగే వస్తారని, టీడీపీ, జనసేనకు ఆ సత్తా ఉందా అని సవాల్ విసిరారు. పాదయాత్రలో జనం లేక లోకేశ్ నవ్వులపాలు అవుతున్నాడన్నారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న ఎమ్మెల్యేలు 2024లో గెలుస్తారో లేదో తెలియడం లేదని, రెండంకెలు కాస్త ఒక అంకెగా మారే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవని లోకేశ్‌కు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు.

గెలిపించండి

త్వరలో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అనిల్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం: మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ కొండల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొలగమూడిలో 80 సీట్లు, నార్త్ ఆములూరులో 40 సీట్లు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో ఈనెల 5 నుంచి వచ్చేనెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 90008 66912, 82476 98231 నంబర్లకు ఫోన్ చేయాలని సంప్రదించాలని సూచించారు.

డీఎస్ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసాచారి

నెల్లూరు(క్రైమ్): సెబ్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసాచారి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి (డీఎస్ఈఓ)గా గురువారం నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈఎస్ ఎస్.రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, సెబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన బదిలీల్లో జిల్లా సెబ్ అధికారిణిగా పనిచేస్తున్న కె.శ్రీలక్ష్మిని చిత్తూరుకు, కర్నూలు అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసాచారిని నెల్లూరుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీనివాసాచారి గతంలో నెల్లూరు జిల్లాలో సీఐగా, ఏఈఎస్‌గా, ఈఎస్‌గా, ఏసీగా పనిచేశారు. సెబ్ సిబ్బంది పనిని ఏఎస్పీ డి.హిమవతి పర్యవేక్షించనున్నారు.

నేర నియంత్రణలో తనదైన ముద్ర

శ్రీలక్ష్మి నేర నియంత్రణలో తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడిచే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపారు. నకిలీ, పొరుగు మద్యం, గంజాయి విక్రయాలపై దాడులు చేసి అంతర్రాష్ట్ర నేరస్తులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తీరు మారని నిందితులపై పీడీ యాక్ట్‌లు ప్రయోగించారు. సమర్థవంతమైన అధికారిగా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. గురువారం రాత్రి పోలీసు అతిథిగృహంలో ఆమెకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఎస్పీ సీహెచ్ విజయారావు ఆమె సేవలను కొనియాడారు.

శోభాయమానంగా గిరిప్రదక్షిణ



భక్తుల నడుమ సాగుతున్న గిరిప్రదక్షిణ

- భారీగా తరలివచ్చిన భక్తులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన బిలకూట క్షేత్రం

బిట్రగుంట: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా గిరిప్రదక్షిణను గురువారం నిర్వహించారు. భక్తులకు అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించాలనే లక్ష్యంతో బ్రహ్మోత్సవాలకు ముందురోజు శోభాయమానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా పూజల అనంతరం ప్రసన్నుని చిత్రపటంతో వేదపండితులు వేదనాదం చేస్తుండగా, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య స్వామి కొండ దిగి వచ్చారు. నిలువెత్తు చిద్విలాస చిత్రపటంతో శ్రీహరి నామాలు కీర్తిస్తూ భక్తులు సవ్యదిశలో కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అన్నమయ్య కీర్తనలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండ చుట్టూ భక్తులు చేసిన పరిక్రమణ భక్తిపారవశ్యంతో సాగింది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గిరిప్రదక్షిణకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ కూడా నిర్వహించిన అనంతరం భక్తులతో కలిసి గిరిపరిక్రమణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ప్రశాంత వాతావరణంలో స్వామి దర్శన భాగ్యం లభించేలా విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, నాగులవరం మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు, సర్పంచ్ శ్రీరాం గోపాల్, ఉభయకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

భూసారం ఎంతో కీలకం

- జిల్లాలో ముమ్మరంగా భూసార పరీక్షలు
- భూమిలో నైట్రోజన్, సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- సేంద్రియ ఎరువులు వాడాలని అధికారుల సూచన
- త్వరలో సాయిల్ హెల్త్‌కార్డుల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): మొక్కల పెరుగుదలలో భూమిలో సహజ సిద్ధంగా లభించే పోషకాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే పోషకాలు సమపాళ్లలో లేకపోతే ఆ ప్రభావం మొక్క ఎదుగుదలపై పడుతుంది. ఎన్ని ఎరువులు, మందులు చల్లినా ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో వివిధ రకాల పంటలను సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. వాటిలో కొన్ని ఆయా కాలానికి అనుగుణంగా సాగులో ఉంటాయి. ప్రధానంగా భూమి సారాన్ని బట్టి పంటలు వేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని అధికారులు చెప్పే మాట. అనేకమంది అన్నదాతలు నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రానికి మట్టిని తెస్తుంటారు. సాగు ప్రారంభం దశ అయితే ఏడాదిలో సుమారు ఐదువేల పరీక్షలు చేస్తుంటారు. నాన్ సీజన్‌లో అయితే ఆ సంఖ్య 2,500 వరకు ఉంటుంది. గడిచిన ఆరునెలల్లో 1,025 భూసార పరీక్షలను సంబంధిత అధికారులు చేశారు.

ఏవి తక్కువంటే..

సాధారణంగా భూమిలో 9 రకాల పోషకాలు ఉంటాయి. ఇటీవల విడుదల చేసిన భూసార పరీక్ష ఫలితాల్లో అధికారులు పలు అంశాలను గుర్తించారు. భూమిలో సేంద్రియ కర్బనం (ఓసీ) 70 శాతం, నైట్రోజన్ (ఎన్) 95 శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన జింక్ 46 శాతం, ఐరన్ 32 శాతం, కాపర్ 12 శాతం, మాంగనీస్ 22 శాతం, బోరాన్ 33 శాతం, ఫాస్పరస్ 17 శాతం, పొటాషియం 68 శాతం తక్కువగా ఉన్నట్లు బయటపడింది.



భూసార పరీక్షలను పరిశీలిస్తున్న ఏడీఏ

ఇలా చేస్తే..

భూమిలో ప్రధానంగా సేంద్రియ కర్బనం, నైట్రోజన్ తక్కువగా ఉంది. మిగిలినవి కొన్ని అటూ ఇటుగా ఉన్నా ఇబ్బంది లేదు. పై రెండూ అవసరమైన స్థాయిలో లేకపోతే మొక్క ఎదుగుదలపై ప్రభావం పడుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రబీ, ఖరీఫ్ సీజన్లలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకు వివిధ రకాల ఎరువులను వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే అధిక మోతాదులో వాటిని వినియోగించొద్దని, విడతల వారీగా తక్కువగా వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రధానంగా సేంద్రియంగా దొరికే వాటిని ఉపయోగిస్తే నైట్రోజన్, సేంద్రియ కర్బన శాతం పెరిగి మొక్క బాగా ఎదుగుతుందని చెప్పుకొస్తున్నారు.

సాయిల్ హెల్త్‌కార్డులు

భూసార పరీక్షలు చేసిన రైతులకు భూమిలో ఎటువంటి పోషకాలున్నాయి? ఏ పంటలకు ఏవి తగిన మోతాదులో ఉంటాయి? తదితర వివరాలతో భూ ఆరోగ్య పత్రం (సాయిల్ హెల్త్‌కార్డు)ను భూసార పరీక్ష కేంద్ర అధికారులు రైతులకు అందించనున్నారు. కార్డుల పంపిణీ ప్రక్రియ తదితర వాటిపై అధికారులకు శుక్రవారం నుంచి శిక్షణ కార్యక్రమం ఇస్తారు. ఈ కార్డులతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

రైతులకు వివరాలు ఇస్తున్నాం

భూసార పరీక్షల ఫలితాలను రైతులకు అందజేస్తున్నాం. భూమిలో ఏ పోషకాలు ఏ విధంగా ఉంటాయో వివరించి దానికి అనుగుణంగా పంటలు వేసుకుంటే లాభదాయకంగా ఉంటాయని చెబుతున్నాం.

– అనసూయ, ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర హెల్త్ సర్వేలైన్స్ అధికారి వెంకటేశ్వర్లు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సోమశిల: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయంలో అశ్రద్ధ తగదని రాష్ట్ర హెల్త్ సర్వేలైన్స్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఏఎన్ఎంలతో మాట్లాడుతూ గర్భిణులకు ప్రతినెలా రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పలువురు రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారి వరలక్ష్మికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట పీహెచ్ఎన్ సుభాషిణి, డాక్టర్ రాకేష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 68 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి గురువారం జిల్లా వ్యాప్తంగా 68 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జనరల్‌కు సంబంధించి 1,678 మందికి 1,651 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 191 మందికి 163 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 1,594 మందికి 1,581 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఆర్ఐఓ, డీవీఈఓ, హైపవర్ కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు 29 కేంద్రాలను తనిఖీ చేశారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు గురువారం వెలుగుచూశాయి. బిట్రగుంటలో రైల్వే ఉద్యోగి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడగా, దగదర్తి మండలంలో కుటుంబ కలహాలతో ఒకరు, అనంతసాగరం మండలంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు.

రైలు కింద పడి..

బిట్రగుంట : బోగోలు ఎస్సీ కాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి అంబటి కమలేశ్వరరావు (38) బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. సికింద్రాబాద్‌లోని లాలాగూడ రైల్వేవర్క్‌షాప్‌లో ఉద్యోగిగా పనిచేసే కమలేశ్వరరావు భార్యతో కలిసి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో భార్యతో కలిసి కావలిలోని అత్తారింటికి అని బయలుదేరిన కమలేశ్వరరావు భార్యను కావలిలో దింపి అదే ట్రైన్‌లో నెల్లూరు వరకు వెళ్లొస్తానని బయలుదేరాడు. రైలు బిట్రగుంట స్టేషన్ చేరుకున్న తర్వాత ట్రైన్ దిగి చక్రాల కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కాగా కమలేశ్వరరావు మృతితో ఎస్సీ కాలనీలో విషాదం నెలకొంది.

కుటుంబ కలహాలతో..

కావలి రూరల్ : కుటుంబ కలహాలతో తులసింగారి రమేష్(42) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దగదర్తి మండలం ఉలవపాళ్ల జాతీయ రహదారి వద్ద ఉన్న ఆటవీప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. దగదర్తి ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాళ్ల జాతీయ రహదారి పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వేపచెట్టుకు వేలాడుతుండటాన్ని హైవే పోలీసులు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి గురించి చుట్టుపక్కల వారిని ఆరాతీయగా, అల్లూరు మండలానికి చెందిన తులసింగారి రమేష్‌గా గుర్తించారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమేష్ మానసిక స్థితి సరిగ్గా లేక కుటుంబ సభ్యులతో గొడవలు పడుతుండేవాడు. ఈ తరుణంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్‌కు ఉరేసుకున్న విద్యార్థి



మాధవ (ఫైల్)

సోమశిల : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతసాగరం మండలం లింగంగుంటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఏటూరు మల్లికార్జున, ధనమ్మలకు మాధవ (15), శివప్రియ సంతానం. అనంతసాగరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మాధవ గత కొద్ది రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలికిడి కావడంతో పక్కింటి వారు వచ్చి చూసి తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడి మృతి చెందడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- నాబార్డ్ జిల్లా మేనేజర్ రవిసింగ్



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న నాబార్డ్ జిల్లా మేనేజర్ రవిసింగ్

ముత్తుకూరు : మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డ్ కృషి చేస్తోందని నాబార్డ్ జిల్లా మేనేజర్ రవి సింగ్ అన్నారు. గోపాలపురంలోని అదానీ ఫౌండేషన్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం కృష్ణపట్నం గ్రామంలో పొదుపు మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు అదానీ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల పొదుపు గ్రూపుల్లోని మహిళలకు వివిధ ఉత్పత్తుల తయారీకి శిక్షణ ఇచ్చి, వాటిని ఏ విధంగా మార్కెటింగ్ చేయాలన్న అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు రాజేష్‌రంజన్, రమేష్‌బాబు మాట్లాడుతూ, ఆసక్తి ఉన్న గ్రూపులను గుర్తించి, ఏప్రిల్ నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలికి కాన్పు

కావలి రూరల్ : ఫిజియోథెరపిస్టు డాక్టర్ హిమబిందు ప్రభుత్వాస్పత్రిలో కాన్పు చేయించుకుని ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆమె ఫిజియోథెరపిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె గురువారం సాధారణ కాన్పు ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం హిమబిందు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండడంతో ఎటువంటి భయం లేకుండా ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు.


కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్) : కుటుంబ నియంత్రణపై అన్నివర్గాల ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య సూచించారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ పెద్దాస్పత్రి(జీజీహెచ్) పీపీ యూనిట్‌లో గత 15 రోజులుగా కొండాపురం, ఇనమడుగు పీహెచ్‌సీల డాక్టర్లు, సపోర్టింగ్ వైద్యసిబ్బందికి ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య హాజరై, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రైబల్, ఇతర కొన్ని రకాల కులాల్లో ఇప్పటికీ కుటుంబ నియంత్రణ సరిగ్గా పాటించడం లేదన్నారు. నాలుగో, ఐదో కాన్పుకు కూడా కొంతమంది పెద్దాస్పత్రికి వస్తున్నారన్నారు. ఇలాంటి వారికి ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఆర్‌ఎంఓ డాక్టర్ కళారాణి, గైనకాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమీలా రాజకుమారి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 104
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 206
లేయర్ చికెన్ : 128

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.82
సన్నవి : రూ.70
పండ్లు : రూ.40